మినీ కథ.

# అహహ్హా హ్హా!



వేమకోటి సీతారామశాస్త్రి

మొదటి రిలీజు తెలుగు సినీమాకు ఇంటర్వెల్ యిస్తే యెలా వుంటుందో మధ్యాహ్నం వొంటి గంటకు కోర్టు ఆవరణ అలా వుంది.

ప్లీడర్లు, గుమస్తాలు, కాఫీ దుకాణాల యజమానులు- వొకరేమిటి అన్నిరకాల మనుషులతోటీ, మనస్తత్వాలతోటీ ఓ చిన్నసైజు రాష్ట్రంలా వుందా కోర్టు ఆవరణ

"ఏమిటి ప్లీడరుగారూ! దేవుడి దర్శనమయినా అవుతుందిగానీ, మీ దర్శనం అవడంలేదు. మీ కోసం కాళ్ళరిగిపోయినట్లు తిరుగుతున్నాను మీరీ మధ్య హైదరాబాద్ వెడితే...." ఆగిపోయాడు. లంకవరం నాయుడుగారు, అటూ ఇటూ చూస్తూ అదేదో రహస్యమన్నట్లుగా. ఆ ప్లీడరుగారు వొక రాజకీయ నాయకుడు. వచ్చే ఎలక్షన్లలో పోటీ చేద్దామని, మందీమార్బలం ఇప్పట్నించే కూడ దీసుకుంటున్న వ్యక్తి.

"అదేమిటి నాయుడుగారూ! దేవుడికి కాళ్ళూ, చేతులు వున్నా కదల్లేడు. అందువలన యెప్పుడు వెళ్ళినా దొరుకుతాడు. మరి నాకు కాళ్ళు, చేతులు కదుల్తాయి కదా అందువలన తిరుగుతాను. ఇంతకీ సంగతేంటి?"

లంకవరం నాయుడుగారు నవ్వారు దేవుడి మీద జోకుకు బిగ్గరగా. గయోపాఖ్యానంలో గగ్గయ్య నవ్వులా వుందా నవ్వు శ్రీకృష్ణపాండవీయంలో ఎన్. టి. రామారావు నవ్వులా వుందా నవ్వు

ఆ నవ్వు దగ్గరో వున్న చాంబర్సు కిటికీ గుండా గ్రహాంతర్గత రాకెట్‌లా దూసుకుపోయి, జడ్జీగారు తాగుతున్న టీ కప్పులో మునిగిపోయింది.

కోర్టు జవాన్ చాంబర్సు ద్వారం దాటి వచ్చాడు.

"అయ్యగారు మిమ్మల్ని...."

"పిలుస్తున్నారా వస్తున్నాను" అన్నారు నాయుడుగారు గర్వంగా చుట్టూ చూసి. వెత్తెడంచుల మెరిసే జరీపాట్నా పంచె సర్దుకున్నారు. మామిడి పిందెల కండువా తిప్పి వేసుకున్నాడు. వేళ్ళకున్న ఎనిమిది వుంగరాలు తళతళా మెరిసేటట్లు రుద్దుకున్నాడు. ఇవి చేస్తూనే, జడ్జీగార్కి తనను పిలవనవసరం యేముందబ్బా! అనుకుంటూనే కదిలాడు.

"అటు కాదు ఇటు" అంటూ చాంబర్సు కేసి బయల్దేరుతున్న నాయుడుగార్కి కోర్టు వైపు దారి చూపించాడు జవాన్.

గంట మ్రోగింది. కోర్టులో లంకవరం నాయుడుగారు అయోమయంగా నిల్చున్నారు

"దేవుడి సాక్షిగా, అంతా నిజం చెబుతాను, అబద్ధం చెప్పను" అంటూ కోర్టు గుమాస్తా ప్రమాణం చేయించాడు.

"కోర్టు ఆవరణలో, చాంబర్సు దగ్గర మీరు నవ్వారా?" నాయుడిగారికి ముచ్చెమటలు పోశాయి.

"నవ్వానండి."

"అదికాదు యువరానర్! మీరు నాతో యేదో మాట్లాడబోతూ."

"దయచేసి మీరు కూర్చోండి."

రాజకీయ ప్లీడరు మరి మాట్లాడలేదు.

"మీరు బిగ్గరగా నవ్వారా?"

"చిత్తం"

కోర్టు హాలులో కాస్సేపు నిశ్శబ్దం. తర్వాత న్యాయమూర్తి ఇలా తీర్పు చెప్పారు.

"అసభ్యతగా, బిగ్గరగా నవ్వినందుకు కోర్టు సంప్రదాయాలు మన్నించనందుకు శ్రీ లంకవరం నాయుడుగారికి కోర్టు విడిచే లోగా సమయమిస్తూ, మూడు వందలు రూపాయలు జరిమానా లేని పక్షంలో, మూడు వారాలు ఖైదు."

అంతే! జరిమానా కట్టేసిన తర్వాత నాయుడుగారు నవ్వడం మానుకున్నారు నవ్వాలనుకున్నప్పుడల్లా అతనికి నవ్వు ఖరీదు జ్ఞాపకం వస్తుందేది.

గెలవండి!
లక్షలాది రూపాయిలు!
వేలాది బహుమతులు!!
మా
లక్ష్మీప్రసన్న
గ్రూపులో చేరండి!
రు 105/- చెల్లించి
ముందుగా రు 20/- బోనస్సు
కలిపి రు 125/- లకు
మీరు బ్యాంకు క్యాషు
సర్టిఫికెట్ అందుకోండి!
సర్వీసు చార్జీలు లేవు!
అడ్మిషన్ ఫీజు లేదు!!
63
నెలలూ
గెలుపొందుటకు
మీకు
అవకాశము
కలదు!
తిరుమల
సేవింగ్ సిండికేట్
రిజిస్టర్డు నెం: 3968
H.O: ఆల్కాట్ గార్డెన్
మెయిన్‌రోడ్,
రాజమండ్రి-2.
APPAJI SUVARNA